క్లుప్తంగా

బస్సు యాత్రలో అసత్య ప్రచారాలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను టీడీపీ బస్సు యాత్ర బృందం సోమవారం పరిశీలించింది. మెడికల్ కళాశాల ప్రాంతంలో 60 మంది కూలీలు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తదితరుల బృందం కళాశాల ప్రాంతాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ కళాశాల పనులు ప్రారంభించి మూడున్నరేళ్లు అయినా మూడు రూపాయల పనులు కూడా జరగలేదని విమర్శించారు. కళాశాలకు సుమారు 60 ఎకరాలు భూములిచ్చిన 63 రైతులకు భూములు తీసుకున్న ఏడాదిలోనే ప్రభుత్వం సొమ్ములు చెల్లించింది. వీరిలో బ్యాంక్ ఖాతాలు తేడా రావడంతో ఆరుగురు రైతులకు సొమ్ములు వారి ఖాతాల్లో జమ కావడం ఆలస్యమైంది. అయితే రెండేళ్లకు గాని రైతులకు సొమ్ములు చెల్లించలేదని ఎమ్మెల్యే నిమ్మల అసత్య ప్రచారం చేయడంపై స్థానికులు తప్పుబడుతున్నారు.

ఉత్సాహంగా గ్రీన్ డ్రైవ్ ర్యాలీ



గ్రీన్ డ్రైవ్ ర్యాలీ నిర్వహిస్తున్న డీఎన్నార్ కళాశాల విద్యార్థినులు

పాలకొల్లు సెంట్రల్: మొక్కలు నాటడం వల్ల ప్రతీ మనిషి ఆరోగ్యవంతంగా ఉంటారని కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. సోమవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గ్రీన్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థిని వెలివెల జ్యోతి ర్యాలీని ప్రారంభించారు. గ్రీన్ హౌస్ నిమిత్తం రూ. 10 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, పి.ఓ నోబుల్ రాజు, బ్యూటీషియన్ వారిజా లిల్లీ, అధ్యాపకులు వి శిరీష, సత్యనారాయణ, వెంకటరమణ, సంధ్య, మహాలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా పార్వతీదేవి అలంకరణ



శాకంబరిగా దర్శనమిస్తున్న పార్వతీ దేవి

నరసాపురం రూరల్: నరసాపురం వశిష్ట నదీతీరాన ఉన్న అమరేశ్వరస్వామివారి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారిని సోమవారం శాకంబరిగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలతో అమ్మ వారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పుష్పరాజ్‌కు సేవా భూషణ్ అవార్డు



సేవా భూషణ్ అవార్డు అందుకుంటున్న మాల మహానాడు అధ్యక్షుడు పుష్పరాజ్

పెనుగొండ: రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ సేవా భూషణ్ అవార్డును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో సుందరయ్య కళా మందిరంలో సర్వేజనా సుఖినోభవంతు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన బహుమతీ ప్రధానోత్సవ సభలో హైకోర్టు విశ్రాంత జడ్జీ చంద్రకుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు ఈఎస్ సూర్యనారాయణ(మాస్టారు), మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

వీరవాసరం: కొట్లాట కేసులో కేసు నమోదు చేశామని ఎస్సై పి.రమేష్ సోమవారం తెలిపారు. దూసనపూడి గ్రామానికి చెందిన సాంబశివరావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ, మణికంఠం దాడికి పాల్పడ్డారు. గాయపడిన సాంబశివరావును ఆసుపత్రికి తరలించారని, కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

పాలకోడేరు: పెనుమంట్ర హెడ్ కానిస్టేబుల్ పాలా వరప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో జిల్లాలోని సహచర సిబ్బంది వరప్రసాద్ కుటుంబానికి రూ.2.16 లక్షలు వసూలు చేసి జిల్లా ఎస్పీకి అందించారు. ఎస్పీ రవిప్రకాష్ సోమవారం వరప్రసాద్ స్వగ్రామమైన వేంద్రవెళ్లి వరప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చి ఆ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వరప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం



శివారు నల్లవెంకయ్యచెరువు ఎస్సీకాలనీలో మురుగునీటి సమస్యను పరిశీలిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో కవిటం శివారు నల్లవెంకయ్యచెరువు ఎస్సీకాలనీలో మురుగునీటి సమస్య పరిష్కారమైంది. మురుగునీటి సమస్యపై కాలనీవాసులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆయన గ్రామానికి వచ్చి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 1978లో తమ కాలనీ ఏర్పడిందనీ, దాదాపు 500 కుటుంబాలు ఉన్నాయని ఎమ్మెల్యేకు చెప్పారు. పూర్వం నుంచి తమకాలనీ ఇళ్లలోని మురుగునీరు సమీపంలోని పంటబోదెలోకి వెళ్లేదనీ, ఇటీవల మురుగునీరు వెళ్లకుండా రైతులు అడ్డుకోవడంతో ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లకుండా నివాస ప్రాంగణాల్లో ఉండిపోయి రోడ్లపైకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు కాలనీలో వీధుల్లో తిరిగి సమస్యను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి కాలనీకి 300 మీటర్ల దూరంలో పోడూరు పుంతలోని మురుగుబోదెలోకి ఇళ్లలోని వాడకం నీరు వెళ్లేలా కచ్చా డ్రెయిన్ తవ్వించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, తహసీల్దార్ ఆర్వీ కృష్ణారావు, సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కుక్కల సూర్యనారాయణ, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఆర్ఐ కె.రాంబాబు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు సత్తి మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్‌లు చేకూరి సూరిబాబు, పడాల వెంకట సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్పందన



నరసాపురంలో వృద్ధుడి దరఖాస్తున్న పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ



యలమంచిలిలో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్

నరసాపురం రూరల్: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమంలో సోమవారం డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి 54 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ అర్జీలను పరిశీలించి ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. కొప్పర్రు గ్రామానికి చెందిన తామరాడ కృష్ణ గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించలేదని ఫిర్యాదు చేశారు. నరసాపురం వశిష్ట వారధి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి యర్రంశెట్టిపాలెం గ్రామానికి చెందిన పలువురు రైతులు భూసేకరణలో సర్వే నెంబర్లు సరి చేయాలని, రైతుల భూమికి సంబంధించిన తేడాలపై సరిచేసి పరిహారాన్ని అందించాలని సబ్ కలెక్టర్‌ను కోరారు.

యలమంచిలిలో..

యలమంచిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఏడు అర్జీలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో ఐదు, ఆఫ్‌లైన్‌లో రెండు అర్జీలు వచ్చాయి. కనకాయలంక గ్రామానికి చెందిన నామవరపు ప్రసాద్ తన కుటుంబసభ్యుల పేరున ఉన్న డిఫామ్ పట్టా భూమిని ఒక వ్యక్తి ఫోర్జరీ సంతకాలతో ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని, విచారణ చేసి తన భూమిని ఇప్పించాలని అర్జీ ఇచ్చారు. కాజ పడమర గ్రామానికి చెందిన పినిశెట్టి రత్నకుమారి తనకు కాజ తూర్పు గ్రామంలో ఎకరం సాగు భూమికి దస్తావేజుల సవరణ చేసుకున్నామని, సదరు భూమికి ఒన్‌బీలో సవరణ చేయాలని కోరారు. ఆన్‌లైన్‌లో మేడపాడుకు చెందిన చెరుకూరి రామలక్ష్మి ఇళ్ల స్థలం కోసం, బాడవ నుంచి కోట వెంకట రామకృష్ణారావు పట్టాదారు పాసు పుస్తకం కోసం, కొంతేరు నుంచి నిమ్మకాయల రామకృష్ణ ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్ స్థల ఆక్రమణ మీద విచారణ చేయాలని, కొంతేరుకు చెందిన అంబటి భ్రమరాంబదేవి స్థల ఆక్రమణ గురించి, బాడవ నుంచి చవ్వాకుల పెద్దిరాజు పెరుగులంక భూమికి పట్టాలివ్వాలని అర్జీలు పెట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, పంచాయతీరాజ్ ఏఈ వర్ధనపు శ్యాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మర్రిపూడి సురేష్ బాబు, హౌసింగ్ ఏఈ కె రాజారాం, మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి పాల్గొన్నారు.

కుల రాజకీయాలతో లబ్ధి పొందిన పితాని

పితానిపై ఎస్సీ నాయకుల ధ్వజం



ఆచంటలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్సీ సంఘాల నాయకులు

పెనుగొండ: కులాలను అడ్డం పెట్టుకుని రాజకీయంగా లబ్ధి పొంది, కులపరంగా వెలివేతలను ప్రోత్సహించిన ఘనత మాజీ మంత్రి పితాని సత్యనారాయణకు దక్కుతుందని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ విమర్శించారు. సోమవారం ఆచంట ఏఎంసీ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్సీ సంఘాల నాయకులు మాజీ మంత్రి పితాని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నడిపూడి శివారు మిద్దేవారి పాలెంలో ఎస్సీ కులానికి చెందిన 12 కుటుంబాలను స్థానిక బీసీ సంఘం వెలివేశారని ఆరోపించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారన్నారు. అయితే, మార్టేరు జరిగిన టీడీపీ సభలో మాజీ మంత్రి పితాని, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీరంగనాథరాజు పాలనలో ఆచంటలో ఎక్కడా కులాల గొడవలే లేవన్నారు. కులాలు, మతాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ఏకైక నేత మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అన్నారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుపై అవాకులు, చవాకులు పేలితే చూస్తూ పేలితే ఊరుకోమని హెచ్చరించారు. ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య మాట్లాడుతూ వెలికు గురైన కుటుంబాలు ఫిర్యాదు చేయకుండా మగ్గిపోవాలా? పితానిగారూ అంటూ ప్రశ్నించారు. కులాల మధ్య గొడవలు పెట్టి రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. బాధితులను కించపరచడం దారుణమన్నారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుపై దుష్ప్రచారం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ ఈది అనిత, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరావు, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, ఉల్లం జ్యోతి, తప్పెట్ల వెంకట్రావు, ఏఎంసీ డైరెక్టరు కొండేటి భవానీ ప్రసాద్, రావి నాగరాజు, మానుకొండ సత్యనారాయణ, మండల కన్వీనర్లు పలివెల శ్రీను, బుర్రా రవికుమార్, ఇంజేటి సుగుణ రాజు, పార్టీ నాయకులు గంటి బాబూరావు, ఏనుగుపల్లి వరప్రసాద్, సిర్రా పాపారావు, సిర్రా శ్రీరామ్, గొల్లపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వమానవ వేదిక సేవలు అభినందనీయం



వేడంగిలో వృద్ధులకు భోజనాలు వడ్డిస్తున్న సీహెచ్.సత్యనారాయణమూర్తి

పోడూరు: నిరాదరణకు గురైన వృద్ధులు, వికలాంగులు, యాచకులకు నిత్యం భోజన సదుపాయం అందిస్తున్న విశ్వమానవవేదిక సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్.సత్యనారాయణమూర్తి(బాబ్జి) అన్నారు. నిత్యాన్నదానం ప్రారంభించి 2800 రోజులు పూర్తయిన సందర్భంగా వేడంగి లో విశ్వమానవ వేదిక ద్వారా భోజన క్యారియర్‌ల పంపిణీని సోమవారం ఆయన ప్రారంభించారు. అలాగే విశ్వమానవవేదిక వృద్ధాశ్రమం వద్ద ఏర్పాటుచేసిన అన్నసమారాధనను ప్రారంభించి భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో విశ్వమానవ వేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్, మాజీ సర్పంచ్ యర్రంశెట్టి పద్మారావు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నర్సింహారావు, వాసంశెట్టి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొట్లాటపై కేసులు

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో కొట్లాడుకున్న ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్సై కె.గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోళ్ల లక్ష్మణరావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కుడిపూడి దుర్గాప్రసాద్ చెడుగా ప్రచారం చేస్తుండటంతో ఈనెల 16న ఇరువురు గొడవపడ్డారు. దుర్గాప్రసాద్ లక్ష్మణరావును కర్రతో కొట్టడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. అయితే అదే గ్రామానికి చెందిన కుడుపూడి వీర వెంకట్రావు అనే వ్యక్తి తాను ఈ నెల 16న బైక్‌పై వెళుతుండగా పాతకక్షల నేపథ్యంలో కోళ్ల లక్ష్మణ్‌రావు అనే వ్యక్తి తనను కిందికి లాగి కొట్టి గాయపరచాడని భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఇరువురికీ సంబంధించి ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసులు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి



చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఆషాఢ అమావాస్య ను పురస్కరించుకుని నరసాపురం పట్టణంలో శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక 12వ వార్డులోని పడుగుల తోటలో నిర్వహించిన ఈ వేడుకల్లో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ సభ్యుడు మావూరి సత్యనారాయణ, కౌన్సిలర్ ద్వార గంగాభవానిప్రకాష్‌లు మాట్లాడుతూ ప్రతీ ఏటా ఆషాఢ అమావాస్య రోజున శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతిని దేవాంగ కులస్తులు ఎంతో భక్తిబావంతో జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా వీవర్స్ కాలనీ, పడుగులతోట ప్రాంతాకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి చీర, సారె సమర్పించి కుంకుమపూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి ఆనెం ఆనందకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కనకం వరప్రసాద్, కోశాధికారి బళ్ల రమేష్‌కుమార్, బూడిద జోగేశ్వరరావు, ద్వార సారధి, బళ్ల జగదీష్, వీర్న పద్మ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం రూరల్: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. రాజుల్లంక అంగన్‌వాడీ కేంద్రంలో ఓపెన్ కేటగిరీ, సరిపల్లి గరువు అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ కేటగిరీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. అర్హులైన అభ్యర్థులు తమ పదో తరగతి మార్కుల జాబితా, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, 3 పాస్ పోర్టు సైజు ఫొటోలతో మొగల్తూరు సీడీపీవో ఐసీడిఎస్ ప్రాజెక్టు మొగల్తూరు కార్యాలయానికి ఈ నెల 24 తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్వయంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: పెన్షనర్లకు పీఆర్సీ, కరువుభత్యం అరియర్స్ వెంటనే చెల్లించాలని జిల్లా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్ అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన జిల్లా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ జమ చేయాలని, పే రెవిజన్ కరువు భత్యం బకాయిలు ఒకేసారి చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, 11వ పీఆర్సీలో కుదించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ఇంతకుముందు మాదిరిగానే చెల్లించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా వైద్యం అందేలా చూడాలన్నారు. సంఘం కార్యదర్శి డాక్టర్ సాగిరాజు సత్యనారాయణరాజు, కోశాధికారి రవి ప్రసాద్ నివేదికలు సమర్పించారు. సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రతాప్ రాజు, గోపాలకృష్ణమూర్తి, వీఎస్ అప్పారావు, ఈఏ నర్సింహారావు, టీఎస్ రెడ్డి, పీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు

సాక్షి, భీమవరం: స్థానిక రెండో పట్టణ పరిధిలోని రాయలానికి చెందిన కె.విజయత్ తేజ్ తన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం రాత్రి తన ఇంటి ముందు నిలుపుదల చేసి సోమవారం ఉదయం చూసే సరికి లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు.

- వన్‌టౌన్ పరిధిలోని మెంటేవారితోటలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.
- భీమవరం టూటౌన్ పరిధిలోని ఒక ఫైనాన్స్ ఆఫీసులో దొంగతనం చేసిన వి.శ్యాం అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. విజయనగరం జిల్లా నుంచి ఉపాధి కోసం వచ్చిన అతడు ఇక్కడ దొంగతానికి పాల్పడినట్టు చెప్పారు. సీఐ బి.కృష్ణకుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సేవలో విభిన్న ప్రతిభావంతులు





గెద్దా కల్యాణి, వలంటీర్ 9వ వార్డు సచివాలయం

బొంతు రవి, వలంటీర్, కాపవరం

పాలకొల్లు అర్బన్: నవరత్నాలను ప్రజలకు చేరువ చేయడంలో సాధారణ వలంటీర్లతో విభిన్న ప్రతిభావంతులు పోటీ పడి విధులు నిర్వహిస్తున్నారు. వీరి సేవలను లబ్ధిదారులు ప్రశంసిస్తున్నారు. మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన బొంతు రవి బి.కామ్ చదివారు. ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. గత నాలుగేళ్ల క్రితం వలంటీర్‌గా విధుల్లో చేరారు. 58 కుటుంబాలకు నవరత్నాల పథకాలను అందిస్తున్నారు. వీరిలో 43 పింఛన్లు పొందుతున్నారు. ఓ పక్క చదువుకుంటూనే ప్రజలకు సేవ చేస్తున్నాని రవి ఆనందరం వ్యక్తం చేస్తున్నాడు. పట్టణంలోని వెలమగూడానికి చెందిన గెద్దా కల్యాణి పదో చదువుకుంది. ఈమె 30 కుటుంబాలకు సేవలందిస్తున్నారు. అలాగే ఈమె పరిధిలో 35 మంది చిరు వ్యాపారులున్నారు. 10 మంది పింఛన్లు పొందేవారున్నారు. వీరందరికీ ప్రభుత్వ సేవలు అందిస్తుంది.

నేడు జగనన్న సురక్ష సభలు

మొగల్తూరు: నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొననున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. మొగల్తూరు మండలంలో ఉదయం 9.30 గంటలకు కాళీపట్నం తూర్పు, 11 గంటలకు రామన్నపాలెం 1, మధ్యాహ్నం 2గంటలకు నరసాపురం మండలం తూర్పుతాళ్ళు1, 3 గంటలకు తూర్పుతాళ్లు-2, సాయంత్రం 4 గంటలకు నరసాపురం పట్టణంలోని 14, 15 వార్డులకు సంబంధించి ఆయా సచివాలయాల్లో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించనున్నారు.

పోలమూరులో..

పెనుమంట్ర: మండలంలోని పొలమూరులో సొసైటీ ఆవరణలో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభ జరుగుతుందని అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సభలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని 1, 2 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు.

శివదేవునిచిక్కాల, పూలపల్లిలో

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాలలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు జగనన్న సురక్షా గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3గంటలకు పూలపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తారని పేర్కొన్నారు.

వద్దిపర్రు, మట్టపర్రులో..

పోడూరు: మండలంలోని వద్దిపర్రు, మట్టపర్రు గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం సాయంత్రం ×జగనన్న సురక్ష¥ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సుహాసిని ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు మంజూరు చేసిన ధృవపత్రాలను అందజేస్తారని పేర్కొన్నారు.

జగనన్న కాలనీకి అప్రోచ్ రోడ్డు నిర్మాణం



దొంగగూడెంలో జగనన్న కాలనీ ప్రధాన రహదారి నిర్మిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని దొంగగూడెంలో ఉన్న జగనన్న కాలనీ ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక సుమారు 200 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, గృహనిర్మాణానికి రుణం మంజూరు చేశారు. ఇప్పటికే కాలనీలో సగంకు పైగా గృహనిర్మాణాలు తుది దశకు చేరుకొన్నాయి. దీంతో కాలనీలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, తాగునీటి సదుపాయ కల్పన పూర్తి చేశారు. ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడ్డ కాలనీ వాసులకు రహదారి నిర్మాణంతో ఇబ్బందులు తొలగనున్నాయి. ఇటీవల నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో కాలనీ వాసులు ప్రధాన రహదారి విషయాన్ని మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి స్పందించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు రహదారి నిర్మాణం సత్వరం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రహదారి నిర్మాణాన్ని ప్రారంభించారు. త్వరలోనే అంతర్గత రహదారుల నిర్మాణం ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఇబ్బందులు తొలగించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పాలకొల్లు రోటరీ క్లబ్ కమిటీ బాధ్యతల స్వీకరణ



పాలకొల్లు రోటరీ క్లబ్ కమిటీ నూతన సభ్యులు

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహించాలని రోటరీ డీజీయస్ వై.కల్యాణ చక్రవర్తి కోరారు. పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో 2023-24 సంవత్సరానికి రోటరీ క్లబ్, పాలకొల్లు అధ్యక్షుడుగా పెనుమాక రామమోహన్‌రావు, కార్యదర్శిగా మాంటిస్సోరీ స్కూల్ (ఉల్లంపర్రు) మేనేజర్ రావాడ సతీష్, కోశాధికారిగా ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కల్యాణ చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోటరీ పిన్‌ను నూతన కమిటీకి అందించి ఏడాది కాలంలో చేయాల్సినన కార్యక్రమాలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే డా.సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి), రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, పాస్ట్ ప్రెశిడెంట్ ముత్యాల శ్రీనివాస్, సలాది రామచంద్రరావు, తెన్నేటి శ్యాంబాబు, మద్దాల రాంప్రసాద్, డా.ముచ్చర్ల సంజయ్, కావలి నగేష్, పెన్మెత్స సుబ్బరాజు (నాని), గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

1న కొబ్బరి చెట్ల ఫలసాయంపై వేలం

నరసాపురం రూరల్: పట్టణంలోని కోట వద్ద పాలెంలో వేంచేసి ఉన్న కొండాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కొబ్బరి చెట్ల ఫలసాయం పొందేందుకు ఆగస్టు 1న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.రామచంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొబ్బరి చెట్ల కాయలను మూడేళ్ల పాటు తీసుకునే విధంగా ఈ వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.2 వేలు ధరావత్తు సొమ్ము చెల్లించి పాల్గొనాలని కోరారు.